


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు





సంపుటి : 14 సంచిక : 06 మే 2009

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 28
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551



ఈ సంచికలో....
చించినాడ ...... 23-02-2009
గణపవరం ...... 20-02-2009
పాలమూరు .... 28-02-2009



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-02-2009, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు బయట కనిపించేది అంతా భ్రాంతే. చివరకు ఈ భ్రాంతి మనకు దుఃఖాన్ని, అశాంతిని తీసుకొని వస్తుంది. ఒక్క ఆత్మజ్ఞానం తప్పించి ఏదీ దుఃఖంలేని స్థితికి తీసుకొనివెళ్ళలేదు. మీకు పెద్ద సామ్రాజ్యం ఉన్నా అది మిమ్మల్ని దుఃఖంలేని స్థితికి తీసుకొని వెళ్ళలేదు. జ్ఞానంవలన శాంతి వస్తుంది, సుఖం వస్తుంది, అజ్ఞానం వలన అశాంతి, దుఃఖం వస్తాయి. మనిషి ఏదైనా పొరపాటు చేస్తే అది అజ్ఞానంలో ఉన్నప్పుడు చేస్తాడు కాని జ్ఞానంలో చెయ్యడు. మనం ఒక రూపానికి, నామానికి పరిమితమై ఉన్నాము అందుచేత మన హృదయంలో సత్యం ఉన్నా దానిని మనం అంగీకరించలేకపోతున్నాము. మన మనస్సు సత్యాన్ని అంగీకరించదు, దానికి కారణం సత్యం లేకపోవటం వలన కాదు, మన మనస్సులో ఉన్న దోషాలు సత్యాన్ని అంగీకరింపచేయవు. మీరు పూజలు చేయండి, జపాలు చేయండి, సత్సంగాలు చేయండి ఈ సాధనలు అన్నీ ఎందుకు అంటే మన మనస్సును పవిత్రం చేసుకోవటానికే. నీటితో మన శరీరాన్ని ఎలా శుభ్రం చేసుకొంటామో అలాగ భక్తి అనే గంగలో మన మనస్సును పవిత్రం చేసుకోవాలి. మనకు బాహ్యంగా ఎన్ని ఉన్నా మన మనస్సు శుభ్రంగా లేకపోతే, మన బుద్ధి సరిగా లేకపోతే వాటి వలన ప్రయోజనం లేదు. మన బుద్ధిని బాగుచేసుకొందాము అనే ప్రయత్నం మనకు లేదు. పూర్వం ఏమీ ప్రయత్నం చేయలేదు కనీసం ఇప్పుడైనా ప్రయత్నం ప్రారంభించాలి అనే సంకల్పం కూడా మనకు రావటంలేదు. మనం పూర్వజన్మలో పుణ్యకర్మ చేసి ఉండకపోతే మన మొఖం ఈశ్వరుడి వైపుకు తిరగదు. చిత్తశుద్ధి లేని శివపూజలేలయా అన్నాడు వేమన. ఏదో లాంచనానికి చేయటం

ఎందుకు? నీ చిత్తాన్ని బాగుచేసుకోవటానికి నువ్వు ఏమీ చేయటంలేదు. కొంతమంది మంచి పనులు చేసినా ఏదో గౌరవం ఆశించి చేస్తారు కాని భగవంతుని దయను సంపాదించుకోవటానికి మటుకు ఆ పనులు చేయరు. చిత్తశుద్ధిలేని మాటల వలన, చిత్తశుద్ధిలేని పనుల వలన ఏమీ ప్రయోజనం లేదు. మీరు చేసే పనులను భగవంతుడు చూడడు, ఆ పనులు చేసేటప్పుడు మీ తలంపును ఆయన చూస్తాడు.

సత్యం ఒక్కటి అంటే ఒక్కటే. అదే బ్రహ్మం, అదే శాంతి, అదే ఆనందం. ద్వైతం అంటే రెండు ఉన్నది, అద్వైతం అంటే రెండవది అంటూ ఏమీలేదు, ఉన్నది ఒక్కటే. ఒక వస్తువుగాని, ఒక వ్యక్తిగాని ఏదైనా నీకు భిన్నంగా కనిపించినప్పడు దానిమీద నీకు కోరిక కలుగుతుంది. ఆ బంగారం నాకుకావాలి, ఆ పొలం నాకుకావాలి అని నీకు అనిపిస్తుంది. అంతా తానే అనుకొన్నప్పడు ఇంక నీకు కోరిక రాదు, ద్వైతం ఉన్నంతసేపు కోరిక రాకుండా మనం ఆపుచేయలేము. ద్వైతంలో శాంతిలేదు, సుఖంలేదు. నీవు వేరు, నేను వేరు అనే భేదబుద్ధి ఉన్నంతకాలం జన్మలు వచ్చితీరుతాయి, ఎవరూ ఆపుచేయలేరు. అబేధస్థితిని పొందితే ఇంక వాడికి కోరిక లేదు, భయం లేదు. ఆత్మజ్ఞానం పొందాలంటే ముందు మనస్సును బాగుచేసు కోవాలి. శరీరానికి ఇచ్చే విలువ మనం మనస్సుకు ఇవ్వటంలేదు. ఈ సబ్జక్టు వినటం వలన ముందు మీ మానసికఆరోగ్యం బాగుపడుతుంది. మన మనస్సు బురదగుంటకింద ఉన్నా పైకి గంగా నదిలా ఇతరులకు కనబడాలి అనుకుంటాము. మీరు రోడ్డుమీద వెళుతూ ఉంటే బురద గుంటలు చూస్తారు. అంతకంటే పెద్దబురదగుంటలు మన మనస్సులో ఉన్నాయన్న సంగతి మనకు తెలియటంలేదు. మనస్సును బాగుచేసుకోవటానికి శ్రవణం ఒక ప్రక్రియ. భగవంతుడి మాటలను మనం శ్రవణం చేసేటప్పడు ఆయన చేయమని చెప్పిన వాటిని మనం చేయటంలేదు. ఆయన వద్దని చెప్పిన పనులు మనం చేస్తున్నాము అని మనకు తెలుస్తూ ఉంటుంది. బుద్ధుడు ఏమని చెప్పాడు అంటే ఎద్దులు బండిని లాగుతూ ఉంటే ఎద్దుల వెనకాల బండి ఎలా వచ్చేస్తూ ఉంటుందో అలాగే నువ్వు భగవంతుడు వద్దని చెప్పిన పనులు చేస్తూ ఉంటే నీకూడా అశాంతి, దుఃఖం వచ్చేస్తాయి అని చెప్పాడు. శాస్త్రాన్ని ఊరికే చదివేయటం, కంఠతా పట్టేయటం కాదు. మీకు వివేకం ఉండాలి, వైరాగ్యం ఉండాలి. వివేకం, వైరాగ్యం లేకుండా మనకు అంతర్దృష్టి కలుగదు.

మన కళ్ళకు కనిపిస్తున్న ఈ ప్రపంచం అంతా లీల. భగవంతుడు చెప్పినట్లు మనం నడుచుకొంటే ఈ లీలలో కూడా నీ రోజులు బాగావెళ్ళిపోతాయి, బ్రహ్మంను పొందుతావు.

కర్మానుష్టానం అంటే భగవంతుడు ఏ పని అయితే చేయమని చెప్పాడో ఆ పని మీరు చేస్తూ ఉంటే అది కర్మానుష్టానం. జరిగిపోయిన గొడవలు అన్నీ వదిలేసి కనీసం ఇప్పటినుండి అయినా భగవంతుడు చెప్పినట్లు చేస్తున్నామా లేదా అని ఆలోచించుకొని పనిచెయ్యాలి, మనం బాగుపడేవిధానం చూసుకోవాలి. ఈ దేహానికి నీకు ఏమీ సంబంధం లేదు కానీ భగవంతుడు ఏమి చేసాడు అంటే నీకు దేహము నేను అనే బుద్ధిని పెట్టేసాడు. అక్కడ నుండి మనం బయటకు రాలేకపోతున్నాము, ఇది మహామాయ. అందుచేతనే భగవాన్ ఏమన్నారు అంటే అందరూ గజఈతగాళ్ళే గాని నీటిలోనికి దిగి ఈదండి అంటే గజం కూడా ఈదలేకపోతున్నారు అన్నారు. పెద్దపెద్ద పండితులు కూడా ఈ దేహము నేను అనే బుద్ధి దగ్గరే ఉంటున్నారు. దేహము నేను తలంపునుపెట్టుకొని నేను బ్రహ్మమును, నేను బ్రహ్మమును అని నువ్వు అనుకొంటే నిన్ను నీవు వంచన చేసుకోవటం, లోకాన్ని వంచన చేయటం. లోపల రోగం పెట్టుకొని నేను ఆరోగ్యముగా ఉన్నాను అంటే నిన్ను నీవు మోసం చేసుకోవటం, చివరకు ప్రమాదంలో పడతావు.

దేహము నేను అనే బుద్ధిని నీకు భగవంతుడు ఎందుకు పెట్టాడు అంటే ఈ దేహము నేను అనే బుద్ధిని పెట్టుకొని పూర్వంలో నీవు మంచికర్మలు చేసావు, చెడ్డకర్మలు చేసావు అందుచేత మరల దేహము నేను అనే బుద్ధితోటే నువ్వు వాటిని అనుభవించాలి, నువ్వు చేసిన కర్మలు నీకు అనుభవంలోనికి రావటానికి అది పెట్టాడు. నీ తెలివి వలన గాని, డబ్బువలన గాని, గౌరవాల వలన గాని దేహము నేను అనే బుద్ధిలో నుండి బయటకు రాలేవు. ఈశ్వరానుగ్రహం లేకుండా, సాధనలేకుండా, గురువు యొక్క దయలేకుండా అందులోనుండి నీవు బయటకు రాలేవు. రామకృష్ణుడు నరేన్‌తో అంటాడు చాలామంది నన్ను చూడటానికి వస్తున్నారు, కొంత మంది పిచ్చివాడు అంటున్నారు, కొంతమంది బీద బ్రాహ్మణుడు అంటున్నారు, కొంతమందిగుడిలో పనిచేసే పూజారి అంటున్నారు, ఏవో మంచిమాటలు చెపుతున్నాడు వినటానికి వస్తున్నాము అని కొంతమంది అంటున్నారు కాని నరేన్ నేను ఎవడినో నా తల్లితండ్రులకు తప్పించి ఈ లోకానికి తెలియదు అని చెప్పడు. రామకృష్ణుడు తండ్రి సత్యవాది, ఆయన ఆస్థిని అంతా వదులుకొంటాడు కాని ఒక్కమాట అబద్దం చెప్పడు. ఆయన ఒకసారి గయ వెళ్ళి వారంరోజులు ఉన్నారు. అక్కడ మహావిష్ణువుని గదాధరుడు అంటారు. ఆయన రాత్రిళ్ళు అక్కడ గుడిలో నిద్రపోయేవాడు. ఒకరోజున స్వప్నంలో గదాధరుడు వచ్చి నాకు మీ ఇంటికి రావాలని ఉంది, నన్ను రమ్మంటావా అని అడిగాడు. అప్పడు రామకృష్ణుడి తండ్రి ఏమని చెప్పాడు అంటే నువ్వు మా ఇంటికి రావద్దు, మేము తాటాకు ఇంటిలో ఉంటున్నాము, ఒకపూట అన్నంతింటే రెండోపూట

లేకుండా బాధపడుతున్నాము. నువ్వు మహావిష్ణువు, నిన్ను ఏదో దశరధుడు పోషించాడు గాని నేనెక్కడ పోషించగలను, నువ్వు మా ఇంటికి రావద్దు అని చెప్పాడు. నువ్వు వద్దన్నా నాకు రావాలని ఉంది అంటాడు మహావిష్ణువు. రావద్దని ఈయన చెప్పటం మానటంలేదు, వస్తాను అని ఆయన అనటం మానటంలేదు అలా స్వప్నం అయిపోయింది. తరువాత 5 సంవత్సరాలకు రామకృష్ణుడు పుట్టాడు రామకృష్ణుడు నరేన్‌తో ఏమన్నాడు అంటే ఈ శరీరంలో ఉన్నది ఎవడో నా తల్లితండ్రులకు తప్పించి లోకానికి తెలియదు, ఒరేయ్ బుల్లినరేన్ అది నువ్వు ఎంతోకొంత పట్టుకొంటున్నావు నీ పూర్వపుణ్యం బాగుంది. నేను బీదబ్రాహ్మణుడిని అని చెప్పినా నువ్వు నా పాదాలను విడిచిపెట్టటం లేదు అన్నాడు రామకృష్ణుడు.

మనం శివుడిని అయినా, కేశవుడిని అయినా ఎందుకు ఆరాధిస్తాము అంటే వారిని ధ్యానంచేసి, ఉపాసనచేసి, వారిపట్ల భక్తి భావం పెంచుకొంటూ ఉంటే, వారి పాదాలను విడిచిపెట్టకుండా ఉంటే మనలో ఉన్న చైతన్యశక్తి మేల్కొంటుంది, అది మనలో ఉన్న చెడ్డను బయటకు గెంటేస్తుంది, అది ఉపాసన యొక్క లక్ష్యం. మీరు మహర్షులతోటి, మహాత్ములతోటి సాంగత్యం చేస్తారు అనుకోండి మీరు చెడ్డగుణాలను తొలగించుకోవటానికి ప్రయత్నం చేయనక్కరలేదు, వాటి అంతట అవే రాలిపోతాయి. భగవంతుడు అంతటా వ్యాపించి ఉన్నాడు, అన్ని కాలాలలో ఉన్నాడు, వాడు లేనిచోటు లేదు, వాడు లేనికాలం లేదు. మనకు భగవదనుభవం కలిగేవరకూ ఏది వచ్చినా నమ్మటానికి వీలులేదు. మీకు అదృష్టం వచ్చి పడిపోతుంది అనుకోండి, అదీ ఉండదు, ఎప్పుడైనా దరిద్రం వచ్చిమీద పడినా అదీ నిలబడదు, కర్మానుసారం ఏ కాలంలో ఏది రావాలో అది వస్తుంది, దానిని మీచేత అనుభవింపజేస్తాడు, తరువాత అది పోతుంది, పూర్వజన్మలలో మీరు పుణ్యకర్మ చేసారు అనుకోండి, దాని ఫలితం అనుభవించకుండా ఈ భూమిమీద నుండి బయటకు వెళ్ళనివ్వడు. శివరాత్రి రోజున ఉపవాసం చేస్తారు, జాగరణం చేస్తారు. శివరాత్రిరోజున కొంతమంది ఏమి తినకుండా ఉంటారు. కొంతమంది ఎంత కఠినమైన నిష్టలో ఉంటారు అంటే నిర్జల ఉపవాసం చేస్తారు అంటే అసలు మంచినీరుకూడా తాగరు. ఉపవాసం అంటే సమీపంగా ఉండటం అంటే భగవంతుడికి సమీపంగా ఉండాలి. జాగరణ మీరు శివస్మరణతో చేయాలి. చదువుకొనేపిల్లలు నిద్రచెడగొట్టుకొంటున్నాము అనే భావన లేకుండా రాత్రి అంతా ఎలా చదువుతారో అలాగ శివస్మరణలో మునిగిపోవాలి, ధ్యానంలో మునిగిపోయి జాగరణ చేయాలి. ఉపయోగం లేని మాటలు చెప్పకొంటూ రాత్రి అంతా కాలక్షేపం చేస్తారు, అలాకాదు. ఆరోజు విషయచింతన

ఉండకూడదు, అంతా శివస్మరణలో ఉండాలి.

ఆచార్యులవారు ఏమన్నారు అంటే నేను ఇంటిలో ఉండవచ్చు, హిమాలయపర్వతాలలో ఉండవచ్చు, ఏదైనా ప్రయాణంలో ఉండవచ్చు. నా శరీరం ఎక్కడ ఉంటే ఏముంది, నా మనస్సుమటుకు ఎప్పుడూ నీ పాదాలమీద నిలబడి ఉండాలి అని శివానందలహరిలో వ్రాసారు. ఆ పని మనం కనీసం శివరాత్రిరోజున అయినా చేయలేము. మనిషి శరీరంతో చాలా తక్కువ తప్పులు చేస్తాడు, ఎక్కువ తప్పులు, ఎక్కువ పాపాలు మనస్సుతోటే చేస్తాడు అని శాస్త్రంలో చెప్పాడు. మిమ్మల్ని చూసి నేను అసూయపడుతున్నాను అనుకోండి, ఇక్కడ శరీరం అసూయపడటంలేదు, మనస్సు అసూయపడుతోంది. అంటే తప్పు ఎవరు చేస్తున్నారు? శరీరం చేయటంలేదు, మనస్సే తప్పు చేస్తోంది. ఏసుక్రీస్తు ఏమన్నాడు అంటే నీ కళ్ళు తప్పు చేస్తూ ఉంటే, తప్పు చెయ్యవద్దని నీ కళ్ళకు చెప్పు. నువ్వు చెప్పినా కళ్ళు వినకపోతే వాటిని పీకి అవతల పారెయ్యి, ఎందుచేతనంటే శరీరం చనిపోయాక శాశ్వతంగా నరకంలో ఉండటంకంటే ఇప్పుడు బతికిన కొద్దిరోజులు గుడ్డివాడిగా ఉండటం మేలు అన్నాడు. శివుడి మెడలో పాములు, కంఠంలో విషం, కట్టుకొనేది పులిచర్మం అయినా, మీరు మంచి బట్టలు కట్టుకొని, మెడలో బంగారపు వస్తువులు వేసుకొని ఆయన దగ్గరకు వెళితే ఆయన సంతోషిస్తాడు. నేను పాములు వేసుకొన్నాను, వీరు బంగారపు వస్తువులు వేసుకొన్నారు అని అనుకోడు, మిమ్మల్ని చూసి సంతోషిస్తాడు. మనకు లేనిది ఇతరులకు ఉంటే మనం చూసి ఆనందించం సరికదా వారిని ద్వేషిస్తాము. కాని శివుడు మిమ్మల్ని చూసి ద్వేషించడు, మీకు ఉన్నందుకు ఆయన ఆనందిస్తాడు, వాడు శివుడు. నామం వలన, ఉపాసనవలన మీకు అనుబంధం కలుగుతుంది. మీ మనస్సుతో ఈశ్వరుడితోటి అనుబంధం పెట్టుకొంటే మీరు పవిత్రులు అవుతారు. ఈశ్వరుడిని స్మరించుకొంటూ ఉంటే ఆయన రూపాన్ని ధ్యానించుకొంటూ ఉంటే మీకు స్పష్టంగా ఆయన అనుగ్రహం తాలుక స్పర్శ లోపల తెలుస్తూ ఉంటుంది, ఆయన అనుగ్రహం వచ్చి మీ హృదయాన్ని తాకినప్పుడు ఇది నాది కాదు, ఆయన అనుగ్రహం అని మీకు స్పష్టంగా తెలుస్తుంది. అప్పుడు మీరు పొందేసుఖం లౌకికసుఖాల వంటిది కాదు. అది ఒక కెరటం కింద వచ్చి మీ మీదపడుతుంది. అప్పుడు సుఖాన్ని మీరు పొందటంకాదు, ఆ సుఖమే మీరు అయిపోతారు.

నువ్వు లోపలచెడ్డ ఉద్దేశాలు పెట్టుకొని నోటితో అందంగా మాట్లాడుతూ ఉంటే నిన్ను నీవు మోసం చేసుకొంటున్నావు అన్న సంగతి నీకు తెలియటంలేదా? మనస్సు ఈశ్వరుడిని చింతిస్తోంది అనుకోండి, దానిని భక్తి, ప్రేమ అంటారు. అదే మనస్సు విషయాలను చింతిస్తోంది

అనుకోండి, దానిని కామం అంటారు. ఆ పనిచేసేది మనస్సే, ఈ పని చేసేదే మనస్సే. విషయచింతన వలన మనస్సు పాడైపోతుంది, భక్తి వలన మనస్సు పవిత్రమవుతుంది. అందుచేత నీ మనస్సును అటు తిప్పేబదులు ఇటు తిప్పు. మనం నేను, నేను అంటాము. నేను అనేది కూడా ఒక తలంపు. ఇది ప్రథమ తలంపు. ఇది వచ్చాక అనేక తలంపులు వస్తున్నాయి. ఈ నేను ఎవరు? అది ఎక్కడినుండి వస్తోంది అని దానిని ఎవరు విచారణ చేయటం లేదు. శరీరం అన్నం తింటోంది. ఈ నేనుకు రూపం, నామం ఆహారం. ఇది రూపాన్ని, నామాన్ని పట్టుకొని బతుకుతుంది. సంసారం అంటే ఇంట్లో మనుషులు సంసారం కాదు, ఈ నేను సంసారం. ఈ నేనుకు అనుకూలంగా మీ కోడలు ఉంది అనుకోండి, మీతోపాటు ఉండమంటారు లేకపోతే బయటకు పొమ్మంటారు. అక్కడ మీ కోడలు ముఖ్యం కాదు, ఈ నేనే ముఖ్యం. మనం ఏ పనిచేసినా ఈ నేనే కేంద్రంగా ఉంటుంది. ఈ నేనుకు అనుకూలంగా ఉంటే మీరందరూ మంచివాళ్ళే. ఒకవేళ మీరు నిజంగా మంచివారు అయినా ఈ నేనుకు అనుకూలంగా లేకపోతే మీరు చెడ్డవారు అంటుంది. అటువంటి నేనును పట్టుకొని జన్మజన్మల నుండి తిరుగుతున్నాము. ఇది ఒక పిశాచం, ఇదే సైతాను, అది మనలను వైకుంఠానికి వెళ్ళనివ్వదు. మనం ఏ నేనును అయితే పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేస్తున్నామో, ఆ నేనును జారిపోకుండా కొంచెం అట్టేపెట్టుకొంటున్నాను అన్నాడు రామకృష్ణుడు. అది లేకపోతే మీకు బోధించే వాడు ఇంక కనబడడు. ఇవన్నీ ఎందుకంటే మానవజాతి మీద వారికి ఉన్న ప్రేమ. వారిమాట అనుగ్రహం, అవి మాటలు కాదు, మాట రూపంలో ఉన్న అనుగ్రహం.

దేవుడి రూపంకంటే నామం ప్రధానం. ముందు మీరు ప్రయత్నంతో జపం చేయాలి. తరువాత అది సహజమైపోతుంది. అంతవరకు మనం సాధన చెయ్యాలి. పగలు మీరు నామస్మరణ బాగా ప్రాక్టీసు చేస్తారు అనుకోండి, రాత్రి మీరు నిద్రపోతూ ఉంటారు, లోపల హృదయంలో ఆ చింతన జరిగిపోతూ ఉంటుంది. అంటే నిద్ర టైము మనకు ఉపయోగ పడుతోంది. అలా స్మరించగా స్మరించగా ఆ దైవం ఎంత పవిత్రుడో మీ హృదయం కూడా అంత పవిత్రమవుతుంది. హృదయ శుద్ధి గలవారు ధన్యులు, వారు దేవుని చూచెదరు. చేతులతో పనిచేస్తూ ఉండు, కాళ్ళతో నడుస్తూ ఉండు, మనస్సుతో మటుకు ఈశ్వరుడిని స్మరించుకో. నువ్వు వంద సంవత్సరాలు బతికితే వంద సంవత్సరాలలో చేతులతోటి ఒక మంచి పని కూడా చేయలేకపోతే ఆ చేతులను ఏమి చేసుకొంటావు అంటాడు టాగూర్. నీ మనస్సు ఏదో ఒకటి స్మరించకుండా ఉండలేదు. ఒకవేళ నీవు భగవంతుడిని స్మరించటం మానేస్తే విషయాలలోనికి

వెళ్ళిపోతూ ఉంటుంది. అందుచేత మనస్సుకు భగవంతుడి స్మరణ అలవాటు చేసెయ్యి. భగవంతుడిని స్మరించటం వలన ఆయనతో చుట్టరికం కలుస్తుంది. మనకు నిజమైన బంధువు భగవంతుడే. స్మరణ వలన ఆయన పట్ల ప్రేమ కలుగుతుంది. మీరు మంచి విషయాలను ఆలోచిస్తూ ఉంటే, ఈశ్వరుడి గురించి ఆలోచిస్తూ ఉంటే అది కూడా తపస్సే. ఇంట్లో ఏదైనా కష్టం వచ్చినా అది భరించగలుగుతారు అనుకోండి, అది కూడా తపస్సే. తపస్సు అంటే ఎక్కడికో పారిపోయి కూర్చోవటంకాదు మీ ప్రారబ్దం కొట్టే దెబ్బలను భరించటం కూడా తపస్సే. ప్రారబ్దాన్ని మీరు ఇష్టంతో అనుభవిస్తూ ఉంటే అటువంటి ప్రారబ్దాన్ని ఇంక భగవంతుడు వచ్చే జన్మలో రానివ్వడు. ప్రారబ్దాన్ని మీరు ఎలాగైనా అనుభవించాలి అందుచేత దానిని ఇష్టంతో అనుభవించండి. మీరు చేయవలసిన సాధన ఏమిటి అంటే మీ లోపల ఏదో దేహంతో ఏకం అవుతోంది అని మీకు తెలుస్తూ ఉంటుంది. ఆ ఏకమయ్యే దానిని విడదీసి, దేహానికి సంబంధించిన స్మరణ ఆపేసి దైవస్మరణ చేయాలి. అలా దైవ స్మరణ చేయగా చేయగా, ఆత్మస్మరణ చేయగా చేయగా మీకు ఆత్మబుద్ధి కలుగుతుంది, దేహబుద్ధి కరిగిపోతుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-02-2009, గణపవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మౌనం బంగారం, ఈ శబ్దాలు రాగి, వెండి. మౌనం మిమ్మల్ని హృదయంలోనికి తీసుకొని వెళ్ళినంత వేగంగా శబ్దం తీసుకొని వెళ్ళదు. కాని మౌనం అంటే మీకు ఇష్టం ఉండదు, శబ్దం అంటే ఇష్టపడతారు. మనం అలా అలవాటు పడిపోయాము. మౌనం అంటే నోరుమూసుకొని కూర్చోవటంకాదు. మనస్సు ఎక్కడైతే అణిగిపోయిందో అక్కడ నుండి మౌనం వస్తుంది. ఆ మౌనం బోధించినట్లు శబ్దం బోధించలేదు. మనం ఇతరులను ద్వేషిస్తాము కాని మనలను మనం ద్వేషించుకోము. నన్ను నేను ప్రేమించుకొంటాను కాని, నేను మిమ్మల్ని ప్రేమించలేను. మనందరం ఒక్కటే అన్న సంగతి తెలియక ఇవన్నీ వస్తున్నాయి. రూపాలు తేడా, రంగులు తేడా, గుణాలు తేడా కాని లోపలఉన్న పరమార్థం ఒక్కటే. ఇన్ని రూపాలు ధరించినవాడు భగవంతుడే. ఆయన సంకల్పం లేకుండా అసలు రూపం రాదు. మీరూ, మేము ఒక్కటే అన్న సంగతి తెలియకపోవటం వలన ద్వేషించటం జరుగుతోంది. మనందరం ఒక్కటే కాని అది మనకు అనుభవంలో లేదు. అందరం ఒక్కటే అని మనకు తెలిసేవరకూ అంటే అభేదస్థితి పొందేవరకు ప్రతీవాడు శవాలను మోస్తూ ఉండవలసిందే, పునర్జన్మలు రాకుండా ఎవడూ

ఆపుచేయలేడు. మనకు బయట నుండి ఏది వచ్చినా అది పోతుంది. శరీరం పుట్టింది అంటే చనిపోయి తీరుతుంది. ఒకవేళ బయటనుండి నీకు సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా అది కాలప్రవాహంలో పోతుంది. సృష్టిలో ఏ వస్తువులో, ఎక్కడా సుఖం లేదు, శాంతిలేదు. కాని ఉందని అనుకొంటున్నాము. ఎక్కడైతే శాంతిలేదో అక్కడ శాంతి ఉందని అనుకొంటున్నాము, అలా అనుకోవటానికి మన అజ్ఞానం కారణం. మనం నేను, నేను అంటాము. ఆ నేను రూపంలోనే అజ్ఞానం ఉంది, మాయ అంతా నేను రూపంలోనే ఉంది. మనకు అందరికి భగవంతుడు అంటే ఇష్టం ఉండదు, ఎవరి దేహం అంటే వారికి బాగా ఇష్టం, అందరికి శరీరం మీద విపరీతమైన అభిమానం. ఈ శరీరం పోతుంది, ఎంతోకాలం ఉండదు అని అంటే వారు బెంగపెట్టుకొంటారు. శరీరంపోతే ఏమీ పోదు. ఏదో పోతుంది అని మనస్సుకు అనిపిస్తుంది. శరీరం వచ్చినప్పుడు మనం రాలేదు అందుచేత శరీరం పోయినప్పుడు మనం కూడా పోము.

సుఖంకాని, శాంతిగాని బయట నుండి వచ్చేదికాదు. వారికి గౌరవం వచ్చింది అంటారు అనుకోండి, అది పోతుంది అని అర్థం. బయట నుండి ఏది వచ్చినా అది పోతుంది ఎందుచేతనంటే అది నిజంకాదు. వివేకం అంటే గడుసుతనంగా మాట్లాడటంకాదు. కొంతమంది వారి మనస్సులో ఏముందో మనకు తెలియనివ్వరు. ఇవన్నీ లోకవిషయాలు. వివేకం అంటే ఏమిటి అంటే ఇది సత్యము, ఇది సత్యం కాదు, ఇది శాశ్వతము, ఇది శాశ్వతంకాదు అని మనకు తెలియాలి. సత్యాన్ని, అసత్యాన్ని వేరు చేయగలగాలి, ఆ పరిశీలనాశక్తి మనకు ఉండాలి. ఇది సత్యమా, అసత్యమా, దీనివలన పరిణామంలో దుఃఖం వస్తుందా, సంతోషం వస్తుందా అన్నీ చూసుకోవాలి. మనకు దుఃఖాన్ని తీసుకొని వచ్చే వస్తువు సంతోషాన్ని ఇస్తుంది అనుకొంటే మనకు వివేకం లేదు అని అర్థం. అయితే మనలో ఉన్న రాగద్వేషములు, మనకు వివేకాన్ని రానివ్వవు. ఎంతో పూర్వపుణ్యం ఉంటేగాని, సత్కర్మ చేసి ఉంటేగాని ఇది సత్యం, ఇది అసత్యం అని వేరు చేయలేము. వైరాగ్యం ఉంటే ప్రపంచంలో ఏ వస్తువు మీద కూడా వాడి మనస్సు వాలదు. ఎందుచేతవాలదు అంటే అది నిజంకాదు అని వాడికి తెలుస్తూ ఉంటుంది. అది నిజం అనుకొన్నప్పుడు మనం ఎంత ఆపు చేసుకొన్నా మనస్సు అక్కడకు వెళ్ళిపోతుంది, అది నిజం కాదు అని మనకు తెలిస్తే మన మనస్సును అక్కడకు వెళ్ళు అని తోలినా అది వెళ్ళదు, మనం తాత్కాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోకూడదు, మనకు దీర్ఘదృష్టి ఉండాలి. ఈ రోజు గడిచిపోతే చాలు అనుకోకూడదు, దాని పరిణామం ఎలా ఉంటుంది అనేది చూసుకోవాలి. ఎవడికీ తప్పు చేయాలని ఉండదు. మనిషి తప్పు ఎందుకు చేస్తున్నాడు అంటే అజ్ఞానం వలన

చేస్తున్నాడు. ఈ తప్పు చేసేవారు కూడా మంచివారే అయితే వాడి అజ్ఞానం వలన మనిషి పొరపాటు చేస్తున్నాడు, జ్ఞానం కలిగితే వాడు చేయడు. కోట్లాది మందిలో కొద్దిమంది మాత్రమే సాధన చేస్తారు. ఇలా సాధన చేసే కోట్లాది మందిలో ఎవడో ఒక్కడికి మాత్రమే నిజం తెలుస్తుంది అని పరమాత్మ చెప్పాడు.

మనకు ఎవరికీ అశాంతి అంటే ఇష్టం ఉండదు, దుఃఖం అంటే ఇష్టం ఉండదు. ఎందుచేతనంటే అది మన స్వరూపంలో లేదు. ఒక్క స్వరూప సుఖం తప్పించి ఏది వచ్చినా అది పరిణామంలో దుఃఖంగా మారిపోతుంది, ఈ రోజు మీరు బాగానే ఉండవచ్చు ఎప్పటికైనా మీ సంతోషం దుఃఖంగా మారిపోవును. దేహం ప్రారబ్దాన్నిబట్టి వెళ్ళిపోతూ ఉంటుంది. సత్పురుషుల మంచికర్మ, దుష్టుల చెడ్డకర్మ కలిసి అవతారం వస్తుంది. అది సమిష్టి ప్రారబ్దం. అవతారపురుషుడికి వ్యక్తిగతమైన ప్రారబ్దం ఏమీ ఉండదు ఎందుచేతనంటే అక్కడ నేను లేదు. ఒకసారి సీతమ్మ ఏమంది అంటే ఈ రాక్షసులతోటి మనకు వైరం ఎందుకు వారు మనకు ఏమీ అపకారం చేయటంలేదుకదా, ఏదో ఋషులను ప్రజలను కొట్టుకొని తింటున్నారు అంటుంది. సీతమ్మ చెప్పింది బాహ్యానికి బాగానే ఉంది. అయితే అప్పుడు రాముడు ఏమన్నాడు అంటే నీ దేహం, నా దేహం కూడా ఏదో కార్యక్రమం నిమిత్తం ఈ భూమికి వచ్చాయి. రాక్షససంహారం లేదు అనుకో ఈ శరీరాలు భూమిమీదకు ఎందుకు వచ్చినట్లు అన్నాడు. అంటే ఈ దేహం భూమి మీదకు ఎందుకు వచ్చిందో ఆ పని జరిగిపోతూ ఉంటుంది. జటాయువు యొక్క వైభవం చూడండి దశరథుడికి లేని అదృష్టం జటాయువుకు వచ్చింది. దశరథుడికి రాముడి చేతితోటి కర్మకాండ జరుగలేదు కాని జటాయువుకు ఆయన చేతితో కర్మకాండ చేసాడు రాముడు. జటాయువుకు ఆయన చేతులతో కర్మకాండచేసి ఊరుకోలేదు, మహర్షులు, యోగులు ఏ ఉత్తమలోకాలకు వెళుతున్నారో నువ్వు కూడా అక్కడకు వెళ్ళు అన్నాడు, అది రామాజ్ఞ. రామాయణంలో వాల్మీకి ఒకమాట చెప్పాడు దుష్టులు ఉన్నచోట, పాములు ఉన్నచోట మీరు తిరగవద్దు అని చెప్పాడు. ఎక్కువ పాములు మసలుతున్నాయి అనుకోండి మనం అక్కడకు వెళ్ళి కూర్చోము, దుష్టులు కూడా అంతే. దుష్టులు ఏమి చేస్తారు అంటే మీరు వాళ్ళకు ఏమి అపకారం చేయనక్కరలేదు, వారు మీకు అపకారం చేస్తారు. అది వారి స్వభావం. వాడు అన్యాయం చేసాడు అని వారిని విమర్శించటం అనవసరం, వారికి దూరంగా ఉండండి. అక్కడకు వెళ్ళి కూర్చుంటే మీదే తప్పు అవుతుంది అని చెప్పాడు.

పుట్టుకతోటే మనిషికి ఒకో స్వభావం ఉంటుంది, ఆ స్వభావాన్ని జయించకుండా నీకు

ఆత్మజ్ఞానం కలుగదు. స్వభావం ఎక్కడ ఉంది నీ మనస్సులో ఉంది. ఆ మనస్సులో నుండి నువ్వు బయటపడితేకదా నీకు అమృతానుభవం కలగటం. మనస్సులో నుండి నీవు బయటపడాలంటే ఎంతో కృషి చేయాలి, కాలం కలిసిరావాలి, గురువు అనుగ్రహం ఉండాలి. ఇతరులతో పోరాటంకాదు, నీతో నువ్వు పోరాడుకోవాలి. మన దగ్గర పెద్ద తప్పు ఏమిటి అంటే మనలను మనం పరిశీలించుకోము, ఇతరులను పరిశీలిస్తూ ఉంటాము. ఇతరులను పరిశీలించటం వలన, వారిలో ఉన్న తప్పులను తెలుసుకోవటం వలన నీకు ఏమీ ఉపయోగం లేదు. నిన్ను నీవు పరిశీలించుకొని, నీలో ఉన్న బలహీనతలను తెలుసుకొని, వాటిని తొలగించు కొంటే నీకు చైతన్యస్థాయి పెరుగుతుంది. ఇతరులను పరిశీలించేకొలది నువ్వు అజ్ఞానంలో పడిపోతావు, చీకటి లోకాలకు వెళ్ళిపోతావు. మంచి చెడ్డ ఇవి అన్నీ మనస్సు యొక్క కల్పితం. మనస్సు కూడా నిజం కాదు అది కల్పితం. అది కల్పితం కాబట్టి అది ఏదో ఒకటి కల్పిస్తూ ఉంటుంది. నువ్వు మనోనిగ్రహం కోసం ప్రయత్నం చేస్తున్నావు. ఈశ్వరుని దయ లేకుండా మనోనిగ్రహం సాధ్యం కాదు, ఈశ్వరుని దయలేకుండా మనస్సు అణగదు. లోకాన్ని జయించటం అంటే ఇతరుల రాజ్యాలను ఆక్రమించుకోవటం, మనుషులను చంపటంకాదు, వెయ్యిఎకరాలు పొలం, డబ్బు సంపాదించటం కాదు. లోకం అంటే రాగద్వేషాలు. కొంతమంది నిన్ను స్తోత్రం చేస్తారు, కొంతమంది నిందిస్తారు, ఇవన్నీ ప్రకృతికి సంబంధించిన గొడవలు, వీటి ప్రభావం నీ మీద పడకుండా చూసుకొంటే వాడు లోకాన్ని జయించినట్లు అవుతుంది.

ఒకసారి వివేకానందుడు రామకృష్ణుడుతో మీ దగ్గర కూర్చొన్నప్పుడు నాకు బాగానే ఉంది. బయటకు వెళ్ళినప్పడు కొంతమంది దేవుడు ఉన్నాడు అంటున్నారు, కొంతమంది దేవుడు లేడు అంటున్నారు. ఇంతకీ నన్ను ఏమి చేయమంటారు అని అడిగాడు. రామకృష్ణుడు ఏమి చెప్పాడు అంటే నువ్వు దేవుడు లేడు అనేవారి పార్టీలో చేరకు, వారితో సహవాసం చేయవద్దు. దేవుడు ఉన్నాడు అని చెప్పేవారితో సహవాసం చెయ్యి. నువ్వు చెడ్డగొడవలలోనికి వెళ్ళటం ఎందుకు అన్నారు. నీ హృదయంలో ఉన్న నిజం తప్పించి జీవితంలో అన్నీ తలంపులే. అయితే నీ హృదయంలో ఉన్న నిజం తలంపులకు అందదు, నీ మాటకు అందదు, నీ మనస్సుకు అందదు. అందుచేత అది లేదు అని నీవు అనుకొంటున్నావు. అది నిజంగా లేదు అనుకోండి రామకృష్ణుడికి కూడా అనుభవంలోనికి రాదు, అది ఉంది కాబట్టే ఆయనకు అనుభవంలోనికి వచ్చింది. ప్రతీ మనిషికీ లోపల వాచింగ్ ఉండాలి, సహనం పెంచుకోవాలి. సహనం లేకపోతే హృదయం యొక్క లోతులు పెరగవు. హృదయం యొక్క లోతులు పెరగకుండా జ్ఞానం రాదు. జ్ఞానం

అనేది పైనుండి పోసేది కాదు, అది లోపలనుండి రావాలి. కొంతమంది ఎప్పడూ ఏదో విషయం గురించి వర్రీపడుతూ ఉంటారు. సాధనలో మొట్టమొదట చేయవలసింది ఏమిటి అంటే నువ్వు వర్రీ పడటం ఆపుచేయాలి. నువ్వు వర్రీపడటం వలన వారు పెద్దవాళ్ళు అయిపోరు, ధనవంతులు అవ్వరు. వర్రీపడటం ఆపుచేయటమే గొప్ప సాధన. అందుచేత కుటుంబ విషయాలను గురించిగాని, లోకవిషయాలను గురించిగాని ఏ విషయంలోను నువ్వు వర్రీపడవద్దు. మనస్సులో వారి క్షేమం కోరవచ్చుగాని వర్రీపడటం వలన వారు ఏమీ అభివృద్ధిలోనికి రారు.

మీరు లోకాన్ని చూస్తే చూడండి కాని లోపల స్వరూపాన్ని వదిలేసి, ఈశ్వరస్మరణ వదిలేసి అస్తమాను మీరు లోకాన్ని చూస్తూ ఉంటే మీ మనస్సు పాడైపోతుంది, వివేకం చచ్చిపోతుంది, చివరకు కుళ్ళిపోతారు. దూర్వాసుడికి కోపం ఎక్కువ అని భగవాన్‌తో అంటే దూర్వాసుడికి కోపం ఎక్కువ, కోపం ఎక్కువ అనుకొనే బదులు వాడు కామాన్ని జయించాడు, అది జ్ఞాపకం పెట్టుకోండి అనేవారు. మంచిని వదిలేసి చెడ్డ పట్టుకొంటారు ఏమిటి? ఎదుటివారిలో మంచీ ఉంటుంది, చెడ్డా ఉంటుంది. మనం ఏమి చేస్తాము అంటే మంచిని వదిలేసి చెడ్డను పట్టుకొంటాము ఎందుచేతనంటే మన బుద్ధి మంచిదికాదు. ఒకసారి ఏసుక్రీస్తు, ఆయన భక్తులు సముద్రం ఒడ్డున నడుస్తున్నారు, అక్కడ ఒక కుక్క చనిపోయి ఉంది. ఒక భక్తుడు ఏమన్నాడు అంటే అది చనిపోయి చాలాకాలం అయి ఉంటుంది, చాలా వాసన వస్తోంది అన్నాడు. ఏసుక్రీస్తు కుక్క వంక చూసి దాని పళ్ళు ఎంత తెల్లగా ఉన్నాయి అన్నాడు. కుక్క కుళ్ళిపోయింది అని దానిలో ఉన్న చెడ్డను చూసేబదులు దాని పళ్ళు చూడండి, ఎంత తెల్లగా ఉన్నాయో అన్నాడు. అంటే దృష్టిని మార్చుకోవాలి, దృష్టి మార్చుకోకుండా దృశ్యం మారదు. మనకు మనో దేహములతో ఎంతకాలం అయితే తాదాత్మ్యం ఉందో అంతకాలం ప్రారబ్ధం దెబ్బలు కొడుతూ ఉంటుంది. మనో దేహములతో తాదాత్మ్యం పోతే ప్రారబ్ధంలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాడికేమీ అనిపించదు, ఆ ప్రారబ్ధం అంతా ఒకటిలేని సున్నలతో సమానం. వాలి భార్య తార వాలితో ఏమంది అంటే నీకు నీ తమ్ముడి మీద కోపం ఎక్కువగా ఉంది. కోపం ఎక్కువగా ఉండటం వలన రాముడు దేవుడు అని నీకు తెలియటం లేదు. రాముడు సామాన్య మానవుడు అనుకొంటున్నావు, చిటికెనవేలితో లోకాన్ని భస్మం చేయగలడు. మానవుడు ఎంత నా ముందు అని నీవు అనుకొంటున్నావు, ఆయన మానవుడి రూపంలో ఉన్న దేవుడు అందుచేత నీవు యుద్ధానికి వెళ్ళవద్దు, రాజీపడటం మంచిది అని చెప్పింది. తార ఇంకా ఏమి చెప్పింది అంటే నీకు ఏమిటి, నాకు ఏమిటి ఈ సృష్టిలో ఎవరికైనా కోపం వచ్చినప్పడు ఆ కోపం మనకు

బంధువు, ఆ కోపం మనకు స్నేహితుడు అనిపిస్తుంది కాని అది స్నేహితుడు కాదు, అది విరోధి. విరోధి ఎంత అపకారం చేస్తాడో అది మనకు అంత అపకారం చేస్తుంది అని చెప్పింది.

మా ఆయనకు ఈ మధ్య తాగుడు ఎక్కువ అయిపోయింది, అందుచేత అశాంతి వస్తోంది అని ఈ మధ్య ఒకరు నాతో చెపుతున్నారు. లోకంలో అనేకమంది తాగుతున్నారు. అప్పుడు నీకు బాధ రావటంలేదు. మీ ఆయన తాగుతూ ఉంటే నీకు బాధ వస్తోంది, అశాంతి వస్తోంది. అంటే నువ్వు ఏమనుకొంటావు మా ఆయనే నేను అనుకొంటున్నావు. అలా అనుకోవటం మానెయ్యి, దుఃఖం లేదు, అశాంతి లేదు. ఆయనకు సేవ చెయ్యవద్దు అని కాదు, సేవ చెయ్యి, తాగుడు మానిపించటానికి మంచిమాటలు చెప్పు. అంతేగాని ఆయనే నేను అనుకోవద్దు. నువ్వు నేను నేను అంటున్నావు కదా, ఆ నేనే నువ్వు కానప్పుడు మీ ఆయన నువ్వు ఎలా అవుతావు. ఆయనే నేను అనుకొన్నంతకాలం ఆవిడకే కాదు, మీకు, నాకు అందరికీ అశాంతి తప్పదు. నువ్వు దేహాన్ని ఆత్మ అనుకోవటం వలన మీ ఆయన మీద మమకారం వస్తోంది. లోపల ఉన్న సత్యవస్తువు, ఆత్మ నీకు తెలిసింది అనుకో ఇంక ఏమీ లేదు. నీ డ్యూటీ ఏదో నీవు చేస్తావు, అప్పుడు మమకారం లేదు, అహంకారం లేదు. పుస్తకాలు చదివినవాడు పండితుడు అని పరమాత్మ చెప్పలేదు. ఏనుగులో, కుక్కలో, కుక్క మాంసం తినేవాడిలో, ఆవులో, బ్రాహ్మణుడిలో ఇలా అంతటా ఏకవస్తువును ఎవడైతే దర్శిస్తున్నాడో వాడు పండితుడు అని చెప్పాడు, అప్పుడు ఇంక వాడికి వికారములు లేవు. అంతటా ఒకే వస్తువును దర్శిస్తూ ఉంటే ఇంక వికారాలు ఏమి వస్తాయి. భిన్నత్వం ఉన్నంతకాలం భయం తప్పదు, అబేధస్థితిని పొందితే భయానికి ఆస్కారం లేదు. మీకు వచ్చే ప్రతీతలంపుకు దేహం కారణమవుతుంది లేకపోతే పేరు కారణమవుతుంది. మీకు దేహం గొడవ, నామం గొడవ లేదు అనుకోండి తలంపులు రావటానికి అవకాశం లేదు.

మీ దేహం ద్వారా ఏ సంతోషం వచ్చినా అది దేశకాలములకు లోబడి ఉంటుంది. దేశకాలములకు అతీతంగా ఉన్నది ఆత్మసుఖం ఒక్కటే. ఉన్నది ఒక్కటే, అదే బ్రహ్మం, అదే ఆత్మ. ఆ బ్రహ్మమే నీ అజ్ఞానం వలన లోకంగా కనిపిస్తోంది. ఒకోసారి చీకటిలో తాడు పాములాగ కనిపిస్తుంది. తాడు పాము అవ్వలేదు, చీకటిలో నీకు సరిగా దృష్టి ఆనక అది పాములాగ కనిపిస్తోంది అంతే. నీకు ఉన్న అజ్ఞానం వలన భగవంతుడే లోకం కింద కనిపిస్తున్నాడు కాని లోకం లేదు. తాడు ఎంత సత్యమో పాము అంత అబద్ధం అలాగే భగవంతుడు ఎంత సత్యమో ప్రపంచం అంత అబద్ధం. ప్రపంచమూ సత్యమే, దేవుడూ సత్యమే అని ఎక్కడా ఉండదు.

ఎందుచేతనంటే సత్యం ఒక్కటిగానే ఉంటుంది. రమణ మహర్షిగారిని ఈ ప్రపంచం ఉందా అని అడిగితే ఆయన ఉందని చెప్పలేదు, లేదు అని చెప్పలేదు, ఉన్న దానివలె కనిపిస్తోంది అని అన్నారు అంటే లేదని అర్థం. మనిషికి మనస్సు ఉంది, దేహం ఉంది, ఈ రెండింటివలన ఉపయోగం ఉందా అని భగవాన్‌ను అడిగితే నీ హృదయంలో ఒక సత్యం ఉంది. దానిని తెలుసుకోవటానికి నీ మనస్సును, దేహాన్ని ఉపయోగించుకో. దానిని తెలుసుకోవటానికి ఈ రెండింటిని ఎంత వరకు ఉపయోగించు కొంటున్నావో అంతవరకే వాటి అవసరం, అది తప్పించి మిగతాది అంతా వేస్టు అని చెప్పారు. అలా కాకుండా మనో దేహములను ప్రకృతిగొడవలకు ఉపయోగిస్తున్నావు అనుకో నీ జీవితం అంతా వృధా అని చెప్పారు.

మనం ఇష్టాలు, అయిష్టాలు పెట్టుకోవటం అనవసరం. ఇష్టాలు, అయిష్టాలు పెట్టుకొంటే మనస్సు బాహ్యముఖానికి పోతుంది. నీకు ఇష్టం లేదు అనుకో, అయిష్టం లేదు అనుకో, మనస్సు యొక్క చాపల్యం ఆగిపోతుంది, నువ్వు గోవిందుడిని స్మరించుకో, స్మరణ వలన కూడా మనోనాశనం అవుతుంది అని ఆచార్యులవారు అన్నారు. నువ్వు ఎన్ని పుస్తకాలు వ్రాసినా, ఎన్ని ప్రయాణాలు చేసినా లోపల ఉన్న నిజంతో నీకు తాదాత్మ్యం లేనప్పడు వాటివలన ఏమీ ప్రయోజనం లేదు. ఒక గుడ్డివాడు, ఇంకో గుడ్డివాడికి ఎలా దారిచూపించగలడు, చివరకు ఇద్దరూ కలిసి గోతిలో పడతారు. బయటగొడవలను, మనుషులను, వస్తువులను చూస్తూ ఉంటే నీ మనస్సు కలుషితం అవ్వకుండా ఆగదు. ఇలా ఎంతకాలం అయితే బాహ్యంగా తిరుగుతావో అంతకాలం నీ మనస్సు కలుషిత మవుతుంది, మరల ఆ కల్మషం పోగొట్టుకోవటానికి పూజలు, జపాలు, సాధనలు, అంటే బాడి చేసుకోవటం కడుక్కోవటం. అందుచేత మనస్సును స్థిరంగా ఉంచుకో. సొంత ఆలోచన విడిచిపెట్టవద్దు, గమ్యాన్ని మర్చిపోవద్దు, కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి, అప్పడు నీవు ఈశ్వరుని దయకు పాత్రుడవుతావు. మనం కల్పించుకొన్న గొడవలను వదిలేయటమే సాధన. గదిని శుభ్రం చేయటం అంటే గదిలో ఉన్న దుమ్మును తీసేయటం, శుభ్రత అక్కడే ఉంది. సాధన పేరుమీద, నువ్వు కల్పించుకొన్న గొడవలను వదిలేస్తే ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు గోచరిస్తుంది. చేతులతో మంచిపనులు చేయాలి, కళ్లతో మంచిదృశ్యాలు చూడాలి, నోటితో మంచిమాటలు మాట్లాడాలి, మనస్సుతో ఈశ్వరుడిని స్మరించాలి, సజ్జనసాంగత్యం చేయాలి. అందరి శుభాన్ని కోరుకోవాలి. అప్పడు మనస్సు నిర్మలమవుతుంది. ఆ పనులు అన్నీ ఎందుకు చేయటం అంటే ఎవరినో ఉద్ధరించటానికి కాదు, మనం పవిత్రులం అవ్వటం కోసం ఇవి అన్నీ చేయాలి. పవిత్రత లేకుండా, ప్రావీణ్యత

లేకుండా, ఏకాగ్రత లేకుండా ఈశ్వరానుభవం నీకు కలుగదు. కొంతమంది భగవాన్‌తో ఏమని చెప్పేవారు అంటే నేను నిన్ను పట్టుకొన్నాను. ఇప్పుడు నిన్ను విడిచిపెట్టేయాలని ఉంది, నా పట్టు వదిలేసానుగాని నన్ను నువ్వు వదలటం లేదు అనేవారు. ఒకవేళ మనకు గురువు మీద కోపం వచ్చి ఆయనను వదిలేసినా ఆయన మనలను విడిచిపెట్టడు, ఆయన ఏ స్థాయిలో ఉన్నాడో ఆ స్థాయికి మనలను తీసుకొనిపోయే వరకు జన్మజన్మలకు మనలను వెంటాడతాడు, మనలను విడిచిపెట్టడు, వాడు గురువు. గురువు ప్రేమ లోకానికి సంబంధించిన ప్రేమకాదు. అది అలౌకికమైనది, అభౌతికమైనది. చైతన్యం యొక్క స్వరూపమే ప్రేమ. అది మనలు పట్టుకొన్నప్పుడు ఇంక మనం ఎక్కడికి వెళ్లలేము. మన ఇంట్లో ఒకరిని ఒకరు ప్రేమించుకొన్నా మరల ప్రేమించటం మానేస్తాము, ఈ ప్రేమలు లౌకికమైనవి, ఇవి కేవలం జీవలక్షణాలు. ఒక్కసారి మీరు గురువు యొక్క అనుగ్రహంలో పడితే మీ లోపల ఉన్న అజ్ఞానాన్ని శుభ్రంగా తొలగించే వరకూ గురువు మిమ్మల్ని విడిచిపెట్టడు. మనలో ఉన్న మాయను, అజ్ఞానాన్ని తొలగించి ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, వాడు గురువు. ప్రతీ చిన్నవిషయానికి మనస్సులో అల్లరి పెట్టుకోవద్దు, మీరు శాంతిని కాపాడుకోండి. ఎందుచేతనంటే శాంతిని కాపాడుకోకపోతే సాధన జరుగదు. అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో శాంతిని కాపాడుకోండి. పురుషుడికి నిజమైన భార్య శాంతే, స్త్రీకి నిజమైన భర్త శాంతే. మీకు శాంతి కుదిరింది అనుకోండి మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది. సంసారంలో గొడవలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి, లోకానికి సంబంధించిన గొడవలు, ప్రకృతికి సంబంధించిన గొడవలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. కాని మీరు శాంతిని కాపాడుకోండి, అదే సాధన యొక్క గమ్యం.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-02-2009, పాలమూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు అవకాశం ఉన్నంతవరకు సత్కర్మ చేయటం మంచిది. మన రూపం, మన నామం మరిచిపోయి మనం పని చేసినా అది సత్కర్మే. మనం జపం చేస్తున్నాము, సత్కర్మ చేస్తున్నాము, యాత్రలు చేస్తున్నాము వీటి అన్నింటి యొక్క ప్రయోజనం మనస్సును బాగుచేసుకోవటమే. మన ఇంద్రియాలను సద్వినియోగం చేసుకొని మనస్సును బాగు చేసుకోవాలి. మనం ఈ భూమి మీదకు వచ్చిన పని అది. మనం ఈ భూమి మీదకు వచ్చి మరల ఈ భూమిని విడిచిపెట్టి వెళ్లేటప్పటికి మనం ఎంతోకొంత మనస్సును పవిత్రం

చేసుకోవాలి. ఎందుచేతనంటే మరణానంతరం ప్రయాణించేది మనస్సే, ఈ మనస్సునే జీవుడు అంటారు. ఈశ్వరుడు అంతటా వ్యాపించి ఉన్నాడు. ఈ జీవులనందరినీ ఆడించేవాడు ఆయనే, జీవులలో అంతర్యామిగా ఉన్నవాడు కూడా ఆయనే. ఈ దేహాలు అన్నీ స్వప్నశరీరాలు. ఈ ప్రపంచం అంతా మనస్సు యొక్క కల్పితమే. ఈ బంధుత్వాలు, స్నేహాలు, విరోధాలు ఇవి అన్నీ మనస్సు యొక్క కల్పితం. నీకంటే వేరుగా ఈ ప్రపంచం ఉందని ఆ తలంపును తీసుకొనివచ్చేది కూడా మనస్సే. శరీరం వచ్చింది అంటే దుఃఖం వచ్చి తీరుతుంది, దానిని ఎవరూ ఆపుచేయలేరు. అయితే శరీరం మనం రావద్దు అంటే ఆగుతుందా? ఆగదు. మనకు భోగదృష్టి ఉన్నంతకాలం, కోరికలు ఉన్నంతకాలం శరీరం వచ్చి తీరుతుంది, దానిని ఎవరూ ఆపుచేయలేరు. భోగదృష్టి ఉన్నంతకాలం, జీవలక్షణాలు ఉన్నంతకాలం జీవుడు హృదయంలో లయం అవ్వడు. మనం బలవంతంగా లోపలకు గెంటినా బయటకు వచ్చేస్తాడు. అంటే ఏదో ఒక వాసన, ఏదో ఒక బలహీనత వాడిని బయటకు తీసుకొని వచ్చేస్తుంది. దేహం రాకుండా చెయ్యాలంటే మనం నామరూపములను మర్చిపోయి పనిచేయాలి. సర్వ సాధారణంగా మంచిపనులు చేసేవారు కూడా గౌరవాల కోసం చేస్తారు. గౌరవం ఎవరికి మనస్సుకి. మీరు మంచిపనులు చేస్తే పుణ్యం వస్తుంది కాని జన్మరాహిత్యస్థితి రాదు. ఏదో గౌరవం ఆశించి మంచిపనులు చేయటంకాదు, మంచి మంచికోసమే చేయాలి.

ఆచార్యులవారు ఏమని చెప్పారు అంటే మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా ఎవరిని ఉపాసన చేసినా మనకు ఈ దేహమే నేను, ఈ మనస్సే నేను అనే తలంపు ఉంది కదా దీనిలో నుండి బయటకురాకుండా మీకు పునర్జన్మలేనిస్థితి రాదు, ఇందులో రాజీలేదు అని చెప్పారు. మీరు శరీరం రాకుండా చేసుకోవాలి అంటే ఆసక్తి లేకుండా పనిచెయ్యాలి, పని పనికోసమే చేయాలి. కాని మనం దేహము నేను, మనస్సు నేను అనే తలంపును ముస్తాబు చేసుకోవటానికి పనిచేస్తున్నాము. అంటే ఏ మనస్సును బాగుచేసుకోవాలి అనుకొంటున్నామో ఒకరకంగా దానిని పాడుచేస్తున్నాము. మీరు చేసేపని మనోనాశనానికి ఉపయోగపడాలికాని మనస్సు పెరిగే పనులు చేయకూడదు, కర్మ అంటే అది, మనం చేసే పని మనలను బంధించకూడదు. మనం డ్యూటీ చేస్తూ ఉండాలి, ఆసక్తి పెట్టుకోకూడదు. ఆసక్తి పెట్టుకొంటే కొత్తవాసనలు వస్తాయి. మనం తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మనకు చెడు తలంపులు ఎక్కువగా వస్తూ ఉంటే చెడ్డ పనులు చేసేస్తాము అందుచేత చెడుతలంపులు రాకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. మీలో కొంతమందికి ఇంటి దగ్గర డబ్బు ఉండవచ్చు, సంపదలు ఉండవచ్చు, గౌరవాలు

ఉండవచ్చు, నౌకరులు ఉండవచ్చు కాని అందరికి ఆధ్యాత్మిక దారిద్ర్యం ఉంది. ఎందుచేతనంటే ఆ సంపదను మనం సంపాదించుకోవటం లేదు, దాని గురించి మనం ప్రయత్నం చేయటంలేదు. పాండిత్యం, ధనం, గౌరవాలు ఇవిఅన్నీ లోకానికి సంబంధించినవి. భక్తి వలన మనకు ముక్తి వస్తుంది. మనం రూపబుద్ధిని, నామబుద్ధిని తగ్గించుకోవాలి. మనకు ఒక రూపం ఉంది, ఆ రూపానికి ఒక నామం పెట్టారు, ఈ రెండూ కల్పితమే. ఈ రూపబుద్ధి నుండి, నామబుద్ధినుండి మనస్సు ఆహారం తీసుకొంటోంది. మనస్సుకు ఆహారం వెళ్లే ఆరూట్‌ను కట్ చేయాలి. ఆ రూట్‌ను కట్ చేయాలి అంటే రూపచింతన, నామచింతన తగ్గించుకోవాలి. అంటే మన రూపాన్ని, మన నామాన్ని పూర్తిగా మర్చిపోవాలి, అప్పుడు కాని మనస్సుకు వెళ్లే ఆహారం కట్ అవ్వదు. అందుచేత సాధనలో, ఈ ఆధ్యాత్మికమార్గంలో మనం బహుజాగ్రత్తగా ఉండాలి. అజాగ్రత్త పనికిరాదు, అశ్రద్ధ పనికిరాదు.

మనం ఏదైనా ఒకమాట మాట్లాడితే, ఏదైనా ఒక పని చేస్తే, ఏదైనా ఆలోచిస్తే చిత్తశుద్ధి కోసం చేయాలి. మనం ఏదైనా ఒక పనిచేసి ఈ పని నావల్లే అయ్యింది, నేను చేస్తున్నాను అనుకొంటే అవన్నీ పునర్జన్మలకి కారణాలు అవుతాయి. మనం చేసాము అనుకొంటాముకాని చేసింది ఈశ్వరుడే, ఇంతమంది కర్తలు లేరు, కర్త ఒక్కడే, ఆయనే ఈశ్వరుడు, ఉన్న వస్తువు ఒక్కటే, అదే అనేక వేషాలను వేసుకొని వస్తుంది. మనకు పునర్జన్మ కారణాలు అన్నీ మనస్సులో ఉన్నాయి. అందుచేత మనోనాశనానికి ప్రయత్నం చేయాలి, అదే మన సాధన యొక్క గమ్యం. పుట్టినవాడు చనిపోతాడు, చనిపోయినవాడు తిరిగిపుడతాడు, అది సహజం. కాని ఈ జననమరణ ప్రవాహంలో నుండి నువ్వు ఎలా బయటకు రావాలో చూసుకో. కేవలం యోగాభ్యాసాల వలన మనస్సు నశించదు. సత్కర్మ చేయటం వలన, ధర్మాన్ని ఆచరించటం వలన, భగవంతుడు చెప్పినట్లు జీవించటం వలన మనస్సు నశిస్తుంది. శాస్త్రంలో ఏమనిచెప్పాడు అంటే ఎవడైతే తనను తాను పోగొట్టుకొంటాడో వాడికి మాత్రమే వస్తువు దొరుకుతుంది. అంటే ఎవడైతే దేహాభిమానాన్ని విడిచిపెట్టాడో వాడికి మాత్రమే హృదయంలో ఉన్న బంగారం దొరుకుతుంది. మీ బిడ్డలు మంచివారు అయ్యి ఉండవచ్చు, మీకు ఇంటినిండా సంపదలు ఉండవచ్చు, కాని మీరు దేనితోటి తాదాత్మ్యం పొందవద్దు. నీ శరీరమే నీది కానప్పుడు అందులో ఏది నీది అవుతుంది. అంటే ఏదీ నీది కాదు. మీ దేహ ప్రారబ్దంలో ఐశ్వర్యం ఉంటే మీ కోరికతో నిమిత్తం లేకుండా అది వస్తుంది మీ కోరికతో సంబంధం లేకుండా మీకు ఏది వచ్చినా అది మిమ్మల్ని బంధించదు. మీ కోరికతో తెచ్చుకొన్నది మిమ్మల్ని బంధిస్తుంది. మీకు

ఆత్మజ్ఞానం కావాలంటే ముందు ఆత్మ గుణాలను సంపాదించు కోవాలి. జీవలక్షణాలు మనస్సును చంపవు. మీరు ఆత్మగుణాలను, కళ్యాణగుణాలను అలవర్చుకొంటే అవి మనస్సును చంపుతాయి. ఎవడికైతే ఆత్మగుణాలు ఉన్నాయో వాడు ఆనందం కావాలి అని అడగనక్కరలేదు. ఆనందం వచ్చి వాడిని వరిస్తుంది. వాడికి సహజం గానే మోక్షం వస్తుంది.

మనకు దూరదృష్టి ఉండాలి, ఒక ప్లానింగ్ ఉండాలి. జీవితంలో అన్నింటికంటే క్రమశిక్షణ ముఖ్యం. భగవంతుడి పట్ల చలనం లేని విశ్వాసం ఉండాలి. సుగ్రీవుడితో రాముడు స్నేహం చేసినప్పడు రాముడు ఏమన్నాడు అంటే అగ్నిసాక్షిగా మనం ప్రమాణం చేస్తున్నాము. నీ కష్టంలో నేను విడిచిపెట్టను అలాగే నా కష్టంలో నువ్వు విడిచిపెట్టకు. నీ సుఖంలోకూడా నేను విడిచిపెట్టను, నా సుఖంలో నువ్వు విడిచిపెట్టకు అన్నాడు అంటే వాడి సుఖం వీడి సుఖం అనుకోవాలి, వాడి దుఃఖం వీడి దుఃఖం అనుకోవాలి, అది మైత్రి, అవి కళ్యాణగుణాలు. మీరు త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేస్తూ ఉంటే దేవుని దయ కూడా వస్తుంది. జ్ఞానానికి మించిన వస్తువుగాని, జ్ఞానంతో సమానమైన వస్తువుగాని ఈ లోకంలో లేదు. అందుచేత మన లక్ష్యం జ్ఞానంవైపుకే ఉండాలి. మనం హృదయపూర్వకంగా జ్ఞానంకోసం ప్రయత్నం చేస్తూ ఉంటే బండరాళ్లవంటి వాసనలు ఉన్నా జ్ఞానమే ఆ వాసనలను దహనం చేస్తుంది. మనిషి బయటకు చూడటం అలవాటు పడిపోయాడు. నువ్వు లోపలకు చూడటం నేర్చుకో, అప్పడు మనస్సు అంతర్ముఖమవుతుంది, అంతర్ముఖం అయితేగాని మనస్సు నశించదు. మనస్సు నశిస్తేనేగాని ఆత్మజ్ఞానం రాదు. సత్పురుషులతో సహవాసం చేస్తూ ఉంటే నీకు దేహంతో ఉన్న సంబంధం, ప్రపంచంతో ఉన్న సంబంధం, విషయాలతో ఉన్న సంబంధం నీకు తెలియకుండా పట్లుబడి రాలిపోతుంది. సజ్జనసహవాసం దొరికితే సహజం గానే నీ మనస్సుకు లోచూపు కలుగుతుంది. మనస్సుకు లోచూపు కలుగకుండా జ్ఞానం మాట అటు ఉంచండి, భౌతికవిషయాలను కూడా వాడు ఏమీ కనిపెట్టలేడు. ఎవడైతే తనని తాను పూర్తిగా మరచిపోయాడో వాడే గొప్పపనులు చేయగలడు. నిరంతరం నీకు నువ్వే జ్ఞాపకం వస్తూ ఉంటే ఇంక జ్ఞానం ఏమిటి, నీకు జ్ఞానం ఎలా వస్తుంది. నువ్వు సాధ్యమైనంతవరకు హోలీకంపెనీలో ఉండు. హోలీమేన్ ద్వారా శాంతితరంగాలు, కాంతి తరంగాలు ప్రవహిస్తూ ఉంటాయి. వారి సమక్షంలో ఉన్నప్పడు ఎంతోకొంత వాటి ప్రభావం నీమీద ఉంటుంది.

నువ్వు ఎక్కడ ఉన్నా దైవచింతన విడిచిపెట్టవద్దు. నీ దేహం ఎక్కడ ఉంది అనేది ప్రధానం కాదు, నీ మనస్సు ఎక్కడ ఉంది అన్నదే ముఖ్యం. అందుచేత భగవంతుడితో

మానసికఅనుబంధం కలిగిఉండు. ఆత్మానుభవం పొందటానికి చాలా రకాల సాధనలు చెపుతారు. తుకారామ్ ఏమన్నాడు అంటే ఇతరుల గొడవ నాకు ఎందుకు, ఓ విఠల్! నాకు సంబంధించినంతవరకు నేను తరించటానికి నీ నామం సరిపోతుంది అన్నాడు. నీ నామమే నాకు చాలు, అది బోటులాగ ఉపయోగపడి ఈ సంసార సముద్రం నుండి నన్ను ఒడ్డుకు తీసుకొని వస్తుంది అని చెప్పాడు. నాకు ఏదైనా కష్టం వచ్చినా అది నీకు తెలియకుండా రావటం లేదు, నాలోని బలహీనతలను తొలగించటానికే ఆ కష్టాలను నీవు పంపిస్తున్నావేమో నాకు తెలియదు. నిన్ను కాదని కోరేవాడు ఇక్కడ ప్రత్యేకంగా ఎవడూ లేడు. ఇదంతా నీ లీల. ఈ దేహము నేను అనే తలంపును పోగొట్టుకోవటానికి నేను ప్రత్యేకంగా ఏమీ ప్రయత్నం చేయలేదు. ఆ పాండురంగడి ప్రేమలో, ఆ ప్రవాహంలో నాకు తెలియకుండానే అది కొట్టుకొని పోయింది అన్నాడు తుకారామ్. నిరంతరం పాండురంగడి స్మరణ వలన తుకారామ్‌కు అమృతానుభవం కలిగింది.

ఈ కలియుగం చీకటి యుగం, ఇక్కడ మంచికంటే చెడ్డ ఎక్కువగా ఉంటుంది, అధర్మం గురించి చెప్పేవారు ఎక్కువ ఉంటారు, ఇది కలిప్రభావం. ఇక్కడ ధర్మాన్ని ఆచరించే వారిని, మంచి చేసేవారిని చూసి హేళన చేయవచ్చు. మంచి చేయటానికి ఎవరూ ఎంకరేజ్‌మెంట్ ఇవ్వరు. ఈ ప్రవాహానికి ఎదురునిలబడి నువ్వు రవ్వంత ధర్మాన్ని ఆచరించినా అనంతమైన ఫలితం వస్తుంది అని ఆచార్యులవారు చెప్పారు. నీ మనస్సు నిర్మలంగా ఉంటే, నీ మనస్సు శాంతిగా ఉంటే, నీ మనస్సు ఆనందంగా ఉంటే నువ్వు ప్రజల మధ్యకు వెళ్ళి బోధించనక్కరలేదు, నీవు అనుభవిస్తున్న శాంతి, ఆనందం ఈ లోకం అంతా వ్యాపిస్తుంది. దేహాన్ని ప్రారబ్దానికి వదిలేయండి, ఆ దేహం ద్వారా ఏ పని జరగాలో అది జరిగిపోతూ ఉంటుంది, దానితో నువ్వు తాదాత్మ్యం పొందవద్దు, భగవదనుభవం పొందటానికి ప్రయత్నం చేసుకో. నీ దేహానికి ఏదో ప్రారబ్దం ఉంటుంది. ఆ ప్రారబ్దాన్ని ఇష్టంతోటి అనుభవించు. మనందరం ప్రారబ్దాన్ని అయిష్టంతో అనుభవిస్తాము. మీ అత్తగారు అంటే మీకు ఇష్టం లేకపోయినా ప్రొద్దుటే కాఫీ ఇవ్వటం ఎలాగూ తప్పదు, అయిష్టంగా ఇచ్చేబదులు ఇష్టంతో కాఫీ ఇయ్యి, అయిష్టంగా అన్నం పెట్టే బదులు ఇష్టంగా పెట్టు, పెట్టటం ఎలాగూ తప్పదు. అయిష్టంగా మాట్లాడే బదులు ఇష్టంగా మాట్లాడు. అప్పుడు నీ ప్రారబ్దం అంతా ఖర్చుఅయిపోతుంది, ఇంక ఇటువంటి ప్రారబ్దం రాబోయే జన్మలో నీకు రాదు. భగవంతుడు నీకు కేటాయించిన పనిని ద్వేషంగా చెయ్యవద్దు, ప్రేమగా చెయ్యి, తరించటం పెద్ద కష్టం,

పెద్ద కష్టం అని అనుకోవద్దు, ఇలా అనుకోవటంలోనే కష్టం ఉంది.

ప్రతీ జీవుడూ రూపానికి, నామానికి కట్టుబడిపోయాడు, అందులో నుండి బయటకు రాలేకపోతున్నాడు. ఇక్కడ మీరు గ్రహించవలసింది ఏమిటి అంటే రూపబుద్ధిని, నామబుద్ధిని తగ్గించుకోండి, ఇప్పడే, ఇక్కడే మీకు అమృతానుభవం కలుగుతుంది. రూపం లేకుండా మనస్సు ఆగలేదు, అది ఏదో రూపాన్ని చింతిస్తూ ఉంటుంది. అది రూపాన్ని పట్టుకొని పుడుతుంది, రూపాలను మారుసస్తూ ఉంటుంది. ఈ రూపాలను పట్టుకొనే దీనికి రూపం ఉందా అంటే దానికి రూపం లేదు. ఈ రూపాలను పట్టుకొనే ఇది ఎవరు అని దానిని విచారణ చేయాలి. ఈ నామ రూపములు నిజంకాదు, ఇవి అన్నీ ఆరోపించబడినవి. నిజం మీకు తెలిసేవరకు నిజం మీద ఆరోపించబడినవి నిజం అనిపిస్తుంది. నిజం మీకు తెలిసాక ఈ ఆరోపించబడినది దానంతట అదే పోతుంది. భగవంతుడిని మనం ఏదీ అడగకూడదు. మనకు ఏది అవసరమో ఆయనే చూసుకొంటాడు. ప్రత్యేకంగా ఇది కావాలి అని అడగ కూడదు. ఒకోసారి మనం అడిగినవే మనకు తంటాలు తెస్తాయి. ఉదాసీనంగా ఉండటం మంచిది. ఇప్పడు నేను ఫలానా వ్యక్తిని అనుకొంటున్నావు కదా, దేహంతోటి, మనస్సుతోటి, పరిసరాలతోటి తాదాత్మ్యం పొందేవ్యక్తి ఉన్నాడు కదా. జ్ఞానం రాగానే ఆ వ్యక్తి కనబడకుండా పోతాడు అంటే జ్ఞానం వచ్చాక దేహగతమైన నేను అక్కడ కనబడదు. మనం మాట్లాడే మాట, మనం చేసే పని, దైనందిన జీవితంలో మన ప్రవర్తన ఎలా ఉండాలి అంటే అవి తిరిగి మనకు జన్మను తీసుకొని రాకూడదు. నీకు శరీరం వచ్చిందా నువ్వు వెయ్యికోట్లు ఉన్న కుటుంబంలో పుట్టినా నీకు దుఃఖం తప్పదు. దేహం వచ్చినవాడికి దుఃఖం రాకుండా ఉండదు. మీరు కర్తృత్వం పెట్టుకొని ఏది చేసినా మీకు దేహం వచ్చి తీరుతుంది. అందుచేత కర్మను కర్మగా చేయవద్దు, కర్మని యోగంగా చెయ్యి. కర్మను యోగంగా చేస్తే నీకు పునర్జన్మ రాదు.

మీకంటే ఎక్కువ చైతన్యస్థాయి ఉన్నవారితోటి, మీకంటే గుణవంతులతోటి, మీకంటే ఎక్కువ వివేకం ఉన్నవారితోటి, మీకంటే ఎక్కువ వైరాగ్యం ఉన్నవారితోటి మీరు సహవాసం చేస్తే వారి సంపద మీకు కూడా వచ్చేస్తుంది. బయట గొడవలు మంచిగా ఉన్నా, చెడ్డగా ఉన్నా వాటి ప్రభావం మీ మెదడుమీద పడనివ్వవద్దు. ఎందుచేతనంటే అవన్నీ అసత్యములే, అవన్నీ మనోకల్పితములే. ముందు మనం రాగద్వేషాలను విడిచిపెట్టాలి లేకపోతే మనం పవిత్రులం అవ్వలేము. మనకు అర్హత వస్తే, యోగ్యత వస్తే సుఖం కోసం, ఆనందంకోసం బయట వెదకనక్కరలేదు, సుఖం, ఆనందం, శాంతి మన దగ్గరకే వస్తాయి. మనం గుడిలో

ఉన్న విగ్రహాలను ఆరాధిస్తాము, దానిని ఉపాసన అంటారు, ఉపాసన వలన మనస్సుకు ఏకాగ్రత వస్తుంది, అప్పుడు అవసరంలేని ఆలోచనలకు మనస్సు వెళ్ళదు, ఏకాగ్రత వలన మీకు శారీరకఆరోగ్యం కూడా బాగుంటుంది. ఒకోసారి భగవాన్ కొంతమంది వంక ఇష్టంగా చూసినట్లు చూసేవారు, కొంతమంది దగ్గర కూర్చొన్నవారితో అసలు మాట్లాడేవారేకాదు. ఆయన పని ఏమిటి అంటే బయట గొడవకాదు, లోపల ఆ జీవుడిని బాగుచేయటం ముఖ్యం. వారితో మాట్లాడకపోతే వారికి కోపం వచ్చేస్తుంది, మనం చాలాదూరం నుండి వచ్చాము భగవాన్ మనతో మాట్లాడటంలేదు అని కోపం వచ్చాక, దీనినే కదా నేను పోగొట్టుకోవలసింది అని అప్పుడు తెలుస్తుంది. ఒకోసారి లోపల ఉన్న మురికి మనకు తెలియదు. గురువు ఏమి చేస్తాడు అంటే నీ లోపల కెలికి వాటిని నీ సహస్రారంలోనికి తీసుకొనివస్తాడు, సహస్రారంలోనికి వచ్చాక ఆ బలహీనతలు నీకు ఉన్నాయి అని తెలియజేసి దానివలన వచ్చే నష్టం మీకు చూపించి అప్పుడు ఆ బలహీనతలను బయటకు లాగుతాడు, వాడు గురువు. మీ మర్యాదలు గురువుకు అక్కరలేదు. మీరు లోపల బాగుపడటం ఆయనకు ముఖ్యం. కొంతమందితో శాంతిగా మాట్లాడతాడు, కొంతమందితో కోపంగా మాట్లాడతాడు, కొంతమందితో హేళనగా మాట్లాడతాడు, ఇలా రకరకాలుగా మాట్లాడినా అదంతా మన మంచి కోసమే, మనలను బాగుచేయటంకోసమే మాట్లాడుతున్నాడు అని గ్రహించినవారు ధన్యులు.

ఒకోసారి మీకు రిపీటెడ్‌గా ఒకే వాసన వస్తూ ఉంటుంది, అది ఎంతో శక్తివంతంగా ఉంటుంది, అది పోదు అని మనకు అనిపిస్తుంది. మీరు కంగారుపడనక్కరలేదు, ఎంత బలీయమైన వాసన అయినా గురువు అనుగ్రహంలో కొట్టుకొనిపోతుంది. మీకు ఇంకా వెయ్యి జన్మలు తీసుకొని వచ్చే వాసనలు, సంస్కారములు మీ లోపల ఉన్నా, అవి ఉన్నట్లు మీకు తెలియజేసి ఈ ఒక్క జన్మలోనే మీచేత అనుభవింపచేసి వాటిని బయటకు లాగి మిమ్మల్ని పవిత్రులను చేస్తాడు, వాడు గురువు. మనం సుఖపడాలంటే ముందు మనం నామరూపాలను మరిచిపోవాలి. ఇవి రెండూ కల్పితాలు, ఇవి రెండూ మరిచిపోతే స్వరూప సుఖం నీకు తెలుస్తుంది. స్వరూపసుఖం మీ చేతికి అందినప్పడు బాహ్యంగా మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా వాటి ప్రభావం మీ మీద పడదు. మీ లోపల ఉన్న జ్ఞానం తాలూక ఊట మీకు దొరికితే ప్రపంచంలో ఉన్న దుఃఖం అంతా వచ్చి మీ మీద పడినా మీ మనస్సు చెదరదు, అట్టిది జ్ఞానం యొక్క వైభవం, దానిని మనం నోటితో చెప్పలేము. అది మీకు అనుభవంలోనికి వచ్చినప్పడు దాని గురించి మీకు తెలుస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

మే 10 జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# "ఐ"సెన్‌సే - నాన్‌సెన్సు

శరీరం "నేను" అనే భ్రమ కారణంగా మనం నిష్పక్షపాతంగా వ్యవహరించలేకపోతున్నాము. నేను వచ్చాకే నాది వస్తుంది. దానితో బాధలు మొదలౌతాయి. ఈ మనస్సు ఓ సత్రం లాంటిది. ఆలోచనలు, అనుభూతులు, కోరికలు అనే అతిథులు దాన్ని దర్శిస్తాయి, చేరుతాయి. ఆతిథ్యం ఇచ్చేవాడు కూడా అక్కడే ఉంటాడు ఆయన ఎవరు? అంటే వాడు ఆగిపోతాడు. ఆ "క్లూ" మనకు తెలియక నాన్‌సెన్సు గొడవల్లోకి వెళ్ళిపోతాము. మనస్సు ఆగాలంటే గురు అనుగ్రహం కావాలి. ఐ సెన్సు ఉన్నంతకాలం మనలను ఈ సమాజం పిండి పిండి చేస్తున్నది. మన ఇష్టాలు, ద్వేషాలు, సంతోషాలు అన్నీ ఐసెన్సులే అవి అన్నీ కల్పితాలు వాటితో మనకు సంబంధం లేదు. మనం ఆత్మ స్వరూపులమే. నేను ఇతరులకంటే అన్నివిధాలా ఉన్నతున్ని అనే భావనలు బలపడితే సంఘర్షణ, బాధ తప్పవు. కారణం మనం ఎప్పడూ ప్రాముఖ్యతను కాపాడుకోవాలి అని అనుకొంటాము. మన మనస్సులో కోరే కోరికలతో నిత్యము పనిచేస్తూ ఉండటం మన లక్షణం. మన రాగద్వేషాల రాపిడితో బాధపడి జీవిస్తూ ఉంటాము. మనస్సుకు సంతృప్తి అంటూ ఉండదు. గర్వంతో ప్రత్యేక వ్యక్తిగా మనలను తయారుచేస్తుంది. నిజమైన మేధావికి తన గొప్పదనం ఏమీ లేదని అంతా ఆత్మ యొక్క ప్రసాదమని భావిస్తూ ఈ కార్యసాధనకు నేను తగిన వాణ్ణి కాకపోయినా భగవంతుడు నన్ను ఎన్నుకొన్నాడని విజ్ఞతతో కృతజ్ఞతతో ఉంటాడు. ఐసెన్సు కేన్సర్‌లాంటిది. అది మనలను, ఇతరులను తినేస్తూ ఉంటుంది. శ్రీ నాన్నగారు "అహంకారాన్ని ఊహించకండి అది లేదని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యండి కామన్‌సెన్సుతో నాన్‌సెన్సు గొడవల్లోకి వెళ్ళకండి" అన్నారు. శరీర బాధకంటే మానసిక బాధ చెడ్డది. శరీర బాధ స్మశానంతో ముగుస్తుంది. అది ముగియదు. మనం ఎంతగా ఒక వస్తువును ఇది నాది అని పట్టుకొమటామో అది వీడు నా బానిస అని పట్టుకొంటుంది. ఒక సత్యం మాత్రమే నిజమని మిగిలినది వదిలేయాలి. మనస్సు ప్రపంచ విషయాలను చూస్తూ వాటి వెంట పిచ్చి పరుగులు తీస్తూ ఉంటుంది. అవి అన్నీ ఎండమావుల్లో జలాలు వంటివి. మనస్సును అధికమించటమే సరియైన మార్గము. మమకారాన్ని తగ్గించుకొని మనోబుద్ధులతో తాదాత్మ్యం వదిలితే కోరికలు అంతరిస్తాయి. బుద్ధి తన సాక్షిలో ఐక్యమౌతుంది, నాన్‌సెన్సు అంతమై శాంతి మిగులుతుంది.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్ధవరం



భద్రాచలం రామాలయం అర్చకులు శ్రీశ్రీనివాసశాస్త్రిగారు
సద్గురు శ్రీ నాన్నగార్ని సన్మానిస్తున్న దృశ్యం



అర్తమూరు భక్తులు సద్గురు శ్రీ నాన్నగార్ని సన్మానిస్తున్న దృశ్యం